## కొత్త పద్ధతులు

25-11-49

# ఆర్త సహాయం

కొండయ్య మామయ్యగారికి మేనల్లుడు నలకయ్య చాయంగల విన్నపాలు చేసి ఉభయ కుశలోపరి తెలియజేసిన విషయం ఏమంటే, మొన్నటి తుపానులో నలకయ్యగారి ఇల్లూ దొడ్డీ, గొడ్డూ గోదా, చెంబులూ తప్పాలాలూ సమస్తమూ కొట్టుకుపోయాయి, నలకయ్యకూ, నలకయ్య భార్యకూ, నలుగురు పిల్లలకూ తిన తిండిలేదు, కట్ట గుడ్డలేదు, ఉంద పంచలేదు. పరిస్థితులు నానాభీభత్సంగా ఉన్నాయి. కనక కొండయ్యగారు, స్వర్గస్థురాలైన నలకయ్య తల్లిని స్మరించిఅయినా, యథాశక్తి నలకయ్యను ఆదుకున్నట్టయితే... కొండయ్య పేరుబడ్డ గాంధీ భక్తుడూ, మంచి హోదాలో ఉన్నవాడూ, ఏ రూపేణా అయితేనేం ఇంత వెనక ఉన్నవాడూ కూడా కనక...

ఉత్తరం సాంతం చదవాలనే ఉత్సాహం కొండయ్యకు కలగలేదు.

కొండయ్య తనలో తానే నవ్వుకున్నాడు. పాపం, తన మేనల్లుడు ఏవిధంగానన్నా తన నుంచి సహాయం ఆశించటానికని ఎంతకాలం నుంచి పొంచి ఉన్నాడో! ఈనాటికి ఈతుపాను వాడికి బహు చక్కగా ఉపకరించింది!

కొండయ్య కనుబొమలు ముడేశాడు. తన కిటువంటి పద్ధతులంటే తగని అసహ్యం. సహాయం కావాలంటే నలకయ్య మగసిరిగా డబ్బు కావాలని రాయకూడదూ? ఇటువంటి బీద అరుపులు అరుస్తాడా? చెంబూ తప్పేలాకూడా పోయిందనీ, తిండికికూడా లేదనీ, కట్టుకునే బట్ట అయినా లేదనీ రాస్తాడా? తన మేనల్లుడు అటువంటి స్థితికివస్తే తనకు నామోషీ అవుతుంది గదా అని! ఛీ, వెధవ యాచనాబుద్ధి! అడుక్కుతినేవాళ్లు మొండిచేతులూ, పుళ్ళూ ప్రదర్శించినట్టు!

తుపానువల్ల కాస్తోకూస్తో నష్టం అయి ఉండవచ్చు—కొండయ్య ఒప్పుకుంటాడు. పూరిగుడిసె కనక కప్పు కారిందేమో! గొడ్డూ గోదా తప్పించుకు పోయిందేమో! ఈ భాగ్యానికి విల విలలాడే మనుషులేం మనుషులు!

"మేమంతా ఇట్లా బావ గారిలాగే మాత్రో మహాత్ముడు సత్యాగ్రహం సాగించి ఉండేవాడే! పెళ్లాల్ని వదిలాం, పిల్లల్ని వదిలాం, ఆస్తులు వదిలాం, సత్యాగ్రహ జ్వాలల్లోకి ఉరికాం. మహాత్ముడు ఊరకమన్నాడు! ఉరికాం! అంతే గాని ఇట్లా వాపోయామా?" అని కొండయ్య తనను తాను ప్రశ్నించుకుని "ఎబ్బే!" అని సమాధానం చెప్పుకున్నాడు.

తాను జైలునుంచి తిరిగి వచ్చిసాక తన భార్యాపిల్లలూ, ఆస్తులూ ఎప్పటిలాగే ఉన్న సంగతి కొండయ్యకు స్ఫురణకు రాలేదు. గాంధీ మతం పుచ్చుకోవటంవల్ల కొండయ్యకు స్ఫురించని విషయాలింకా చాలా ఉన్నాయి. (ఇటువంటి చిక్కులు ఏ మతం పుచ్చుకున్న వారికైనా ఉండేవే ననుకోండి.)

ఉదాహరణకు: కొండయ్య సత్యంతప్ప ఆడడు కనక ఇతరులు, అందులోనూ తన మేనల్లుడివంటి గాంధీ విమర్శకులు, నిజమే చెప్పవచ్చుననేది కొండయ్యకు స్ఫురించదు. తనకన్న అహింసాతత్పరులూ, ప్రజాసేవకులూ, ధర్మనిరతులూ, నిర్మాణ కార్యక్రమ దీక్షాతత్పరులూ ఉన్నారా అంటే ఉండవచ్చునని కొండయ్య ఏనాడన్నా ఒప్పుకుంటాడుగాని నిజంగా, ప్రత్యక్షంగా ఉన్నారంటే భరించలేడు, నమ్మలేడు! అదేమిటని మీరనగలరు. అది అంతే!

రావు

చెప్పవచ్చిన ముఖ్యవిషయమేమంటే కొండయ్య నలకయ్యకు డబ్బు పంపలేదు. తన మేనల్లుడు తన రాజకీయ విశ్వాసాలను పాటించడని కాదు. నలకయ్యకో పది రూపాయలు

పంపితే ఇంతలో కొండయ్య కొంప తరుగుతుం దనీ కాదు. పడలేదు. అంతకన్న ఇంకేమీ లేదు. తనకు వేరే పనులుండటం జరిగింది. ఒకటి రెండు రోజులు ఆదివారమయింది. ఒక రోజు తప్పక పంపుదామంటే పెద్దనోటుకు చిల్లర లేక పోయింది. ఇంతలో, ఇట్లా చూస్తుండగానే నల కయ్య ఉత్తరం వచ్చి పది రోజులో పన్నెండు రోజులో అయి ఊరుకుంది. ఈ లోపల నల కయ్య గొడ్లు దొరికే ఉంటాయని, కప్పు మళ్లా అల్లించి ఉంటాడనీ, ఇంత ఆలస్యంగా పంపితే తనను చూసి నవ్వుతాడేమోననీ, అసలే తన మీద గౌరవం లేనివాడు అఘాయిత్యంగా ఉత్తరం రాస్తాడేమోననీ కొండయ్య డబ్బు పంపే ప్రమేయం మానేశాడు. అది అంతటితో పరిసిపోదని పాపం కొండయ్య కలగన్నాడా?

ఒకరోజు ఎరిగినాయన ఒకడు కనిపించి, "పాపం నలకయ్య కెంత గడ్డురోజులొచ్చాయో! ఇంకా అదృష్టవంతుడు! ఆ పెళ్ళాం చచ్చి బతికింది!" అన్నాడు.

"అదేం?" అన్నాడు కొండయ్య పిచ్చి మొహం వేసి.

"మీరు వినలా? డబుల్ న్యుమోనియా! రాదూ? తడిగుడ్డలతో రెండురోజులల్లా నానితే? ఎవరో ధర్మాత్ములు గుడ్డలేవో ఇచ్చారు. అవన్నీ పిల్లలకు కప్పింది. మొగుణ్ణి కూడా తడిగుడ్డతో ఉండనిచ్చింది కాదు. తన సంగతి ఏమను కుందో!...ఇల్లాలంటే అట్లా ఉండాలి!"

"పాపం, నయమయిందా?"

"ఆ, ఆడాక్టరు ధర్మాన! తనే స్వయంగా పెనిసిలిన్ కొని ఇంజెక్షన్లిచ్చాడు. అతను నల కయ్యతో కలిసి చదువుకున్నాట్ట! నిజంగా స్నేహితుల్ని చెప్పాలండీ!"

"అట్లా చెప్పకులే!"

"చెప్పకంటారేమిటి? మా వాడున్నాడా? వాడు నలకయ్య ఉత్తరం చూస్తూనే నలుగురి దగ్గిర చేబదుళ్లు పుచ్చుకుని నలభై రూపాయలు పంపాడు. నిన్ననే వచ్చింది నలకయ్య దగ్గి ర్నుంచి మా వాడికి ఉత్తరం. ఎంతమందో స్నేహితులు డబ్బు పంపారట. మళ్లీ కొంపవేసు కొన్నాట్ట. చెంబుతప్పాలా అమర్చుకున్నాట్ట! నిజంగానే అదృష్టవంతుడు."

"మాశారా, నాకీవిషయమేమీ రాశాడే కాదు!" అన్నాడు కొండయ్య, నిష్కల్మష మైన హృదయంతోనే.

"తన కొంపపోయిన మాటన్నా రాశాడు కాదా ఏమిటి? ఇదేమిటండీ కామధేనువల్లే మిమ్మల్ని పెట్టుకుని ఉత్తరమైనా రాయక పోవటం!" అన్నాడా పెద్ద మనిషి.

ఆ పెద్దమనిషి అపోహపడ్డాడని కొండయ్యకు అర్థమయింది. కాని అంత గాంధీ భక్తుడికీ, అంత సాహసంతో సత్యాగ్రహజ్వాలల్లో ఉరికిన ధీరు డికీ, నలకయ్య తనకొక ఉత్తరం రాశాడని చెప్ప టానికి ధైర్యం చాలలేదు...

తరవాత రెండు రోజులకు కొండయ్యకు ఆలోచన వచ్చింది. నలకయ్య కొకవంద పంపిద్దా మని. అది అట్లాగే పోతున్నది. ఏదీ? ఒకపనా? ఒక మేళమా? డబ్బున్నప్పుడు జ్ఞాపకముండదు; జ్ఞాపకం ఉన్నప్పుడు డబ్బుండదు! ఏమిటో!

ఈ క్రింది ఊళ్లలో ఇంగ్లీషు, తెలుగు 'స్వతంత్ర' పత్రికలు అమ్మటకు
ఏజెంట్లు కావలెను:

అమలాపురం, చోడవరం, బళ్లారి, శృంగవరపుకోట,
కైకలూరు, పొన్నపల్లి అగ్రహారం

వివరములకు :—

మేనేజరు, **'స్వతంత్ర'**,
160 లాయిడ్స్ రోడ్, రాయపేట మదరాసు-14.

నేతాజీ యింకా సజీవుడుగా ఉన్నాడా? అన్న ప్రశ్నపై పత్రికల్లో తర్జన భర్జనలు ఉండుండి జరుగుతూనే ఉన్నాయి. నీలివార్తల్లోని నిజం ఎంత? ఈ రచయిత అంచనా ప్రకారం, నేతాజీ కమ్యూనిస్టుచైనాలో ఉన్నాడట. "విపులాచ పృథ్వీ" అన్నారు.

# నేతాజీ యింకా సజీవుడేనా?

వి. యల్. సుందరరావు

(అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ కార్యదర్శి)

నేతాజీ ఉనికి, ఆయన అంతర్థానం, గురించి అనేక ప్రకటనలు, వక్తల ప్రసంగాలు సామాన్యప్రజల్ని కలవరపరుస్తున్నాయి. అనుచరుల పార్టీ ప్రచారమని కొందరు, నేతాజీపై అంతర్జాతీయ నిషేధాజ్ఞలు ఉన్నాయని కొందరు యింకా యింకా అనేక అభిప్రాయాలు, ప్రచారం కనిపిస్తుంది. ఆయనపైగల అపార ప్రేమ వాహినులు అతిశయోక్తులనుకూడ కల్పిస్తున్నాయి. పొందికలేని యీ వార్తలను ఆధారంచేసి అనేక విపరీత విమర్శలుకూడ చేస్తున్నారు కొందరు. అజాద్ హింద్ ఆరవ వార్షికోత్సవంనాడు, అక్టోబరు 21-వ తేదీ నేతాజీ రేడియో ప్రసంగం వినాలని దీపావళి పండుగనుకూడ మరిచిపోయి ప్రజానీకం, యావత్ భారత దేశమంతా తహతహ లాడింది. పల్లెలనుండి 30, 40 మైళ్ళు నడిచి రేడియో ఉండే స్థలాలుచేరి అస్సాంలో ప్రజలు నేతాజీ ప్రసంగంకొఱకై యెదురుచూశారని ఆమధ్య కలకత్తాలో మిత్రుడొకడు చెప్పాడు.



ఉత్తర హిందూస్థాన్ పత్రికల్లో ప్రకటించినవి, శ్రీ శరత్ చంద్రబోసు, మేజర్- జనరల్ షా నవాజ్, అఖిలభారత ఫార్వర్డుబ్లాక్ వారు సేకరించిన భోగట్టా ఆధారంచేసుకొని మన మద్రాసు పత్రికలు నిరాదరణగా వదలిన నేతాజీకి సంబంధించిన వార్తలను యీ వ్యాసంలో కూర్చి వ్రాస్తున్నాను.

"నేతాజీవెంట నేను విమానంలో ప్రయాణం చేయలేదు. ఇప్పటి రాజకీయ పరిస్థితులను బట్టి కల్పించిన కట్టుకథ నేను యిండియావచ్చి చెప్పాను. నేతాజీ ఏ మార్గాన, ఎక్కడకు వెళ్ళింది ప్రస్తుతం యెక్కడ ఉన్నదీ నాకు తెలియదు." అని పాకిస్థాన్ వెళ్ళిన కర్నల్ హబిబుర్ రహమాను ప్రకటన చేశాడు.

"అమెరికా, ఇంగ్లండు ప్రభుత్వాలు నేతాజీ విమానప్రమాద పరిశీలనకై నియమించిన కమిటీలు అంతర్జాతీయ న్యాయస్థానానికి రిపోర్టు దాఖలు చేశాయి. ఆ రిపోర్టులలో నేతాజీ విమాన సంఘటన ఒక కల్పితగాథ తప్ప యథార్థం గాదని స్పష్టపరిచారు." అని ఇండియాతరఫున న్యాయమూర్తిగా వెళ్ళిన కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధా బినోద్‌పాల్ మే మాసంలో బహిరంగ ప్రకటన చేశారు.

"భారతదేశనాయకుడు దూరప్రాచ్యములో